ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

రక్షణతో కూడిన ఉత్పత్తితోనే మెరుగైన లక్ష్యాలు

- సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రక్షణతో కూడిన ఉత్పత్తే మెరుగైన లక్ష్యాలను సాధిస్తుందని సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం అన్నారు. డైరెక్టర్ ఆపరేషన్ ఎల్వి.సూర్యనారాయణ, ప్లానింగ్, ప్రాజెక్ట్స్ అధికారి కె.వెంకటేశ్వర్లుతో కలిసి గురువారం పెద్దపల్లి జిల్లా రామగుండం ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 కృషిభవన్‌లో ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ తమకు కేటాయించిన విధులను తప్పనిసరిగా ఎనిమిది గంటల సమయంలో నిర్వర్తించాలని, భారీ యంత్రాల వినియోగ సమయం పెంచాలని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి దిశగా ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జిఎం బి.వెంకటయ్య, జిఎం రక్షణ ఆర్జీ రీజియన్ కె.హెచ్ఎన్ గుప్తా,జీఎం క్వాలిటీ ఆర్జీ రీజియన్ బైధ్యా, ఎఐటియుసి జనరల్ సెక్రటరీ రాజ్ కుమార్, అధికారుల సంఘం జనరల్ సెక్రటరీ నర్సింహులు, బ్రాంచ్ సెక్రెటరీ జిగురు రవీందర్, ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

మేడారంలో పోటెత్తిన యాత్రికులు

- వనదేవతలకు ప్రత్యేక మొక్కులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడారం మినీ జాతర రెండవ రోజు సందర్శకులు పోటెత్తడంతో జనసంద్రంగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు చత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చి వనదేవతలను దర్శించుకున్నారు. జంపన్న వాగులో బ్యాటరీ ఆఫ్ టాప్స్ కింద స్నానాలు ఆచరించి, కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించారు. వనదేవతలకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జంపన్న వాగు, మేడారం గద్దెల ప్రాంతం, ఇంగ్లీష్ మీడియం, ఆర్‌టిసి బస్టాండ్, చిలకలగుట్ట, రెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో సందర్శకులు కిక్కిరిసిపోయారు. తొక్కిసలాట జరగకుండా సులువుగా దర్శనాలు అయ్యేలా పోలీసులు దగ్గర ఉండి చర్యలు చేపట్టారు. 12 న ప్రారంభమైన మినీ మేడారం జాతర ఈనెల 15తో ముగియనుంది.

వనదేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క.. బుధవారం రాత్రి 11గంటల సమయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, గ్రంధాలయ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మేడారం చేరుకున్నారు. గుడి నుంచి సమ్మక్కను గద్దెల వద్దకు తీసుకెళ్లేటప్పుడు ఆదివాసులతో కలిసి ఆమె వెళ్లారు. గురువారం ఉదయం సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు వనదేవతలను ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రైతులు కూడా ముఖ్యమే కాబట్టి లక్నవరం నుంచి నీటిని విడుదల చేయలేదని, జంపన్న వాగు దగ్గర బ్యాటరీ ఆఫ్ టాప్స్ ఏర్పాటు చేశామని అన్నారు. వాటితో పుణ్యస్నానాల ఆచరించాలని తెలిపారు. ప్రజలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు.

సంకెళ్లు వేసి తీసుకొస్తున్నా పట్టదా?

- ప్రధాని మోడీ తమాషాగా చూడటం దుర్మార్గం
- ఎఐపిఎస్ఒ జాతీయ నేతలు కె.యాదవరెడ్డి, దిడ్డి సుధాకర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అమెరికాలో బతకడానికి ఏజెంట్లు, దళారుల ద్వారా వెళ్లి మోసపోయిన భారతీయులను యుద్ధ ఖైదీల మాదిరిగా కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసి తీసుకొచ్చి ఇక్కడ వదిలేస్తుంటే ప్రధాని మోడీ తమాషాగా చూడటం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్సీ, ఎఐపిఎస్ఒ జాతీయ నేత కె.యాదవరెడ్డి, ఎఐపిఎస్ఒ జాతీయ అధ్యక్ష వర్గ సభ్యులు దిడ్డి సుధాకర్ విమర్శించారు. ఉక్రెయిన్‌లో యుద్ధం ఆపి భారతీయులను విమానాల్లో తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రధాని మోడీ..అమెరికాలో ఇన్‌లీగల్‌గా ఉంటున్న ఐదారు వేల మందిని గౌరవంగా తీసుకురాలేరా? అని నిలదీశారు. అక్కడకు బతకడానికి వెళ్లిన వారిపై బిజెపి వాళ్లు క్రిమినల్స్ అని ముద్ర వేయడమేంటని ప్రశ్నించారు. అక్కడకు వెళ్లిన వారిలో ఎక్కువగా అప్పులు చేసిన వెళ్లినవారు, గుజరాతీయులు ఉన్నారని తెలిపారు. వారికి బేడీలు వేసి తీసుకురావడాన్ని తప్పుబట్టారు. అమెరికాలోని మన ఎంబసి ద్వారా దేశానికి తీసుకొచ్చే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను కాపాడాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ఆధ్వర్యంలో ట్రంప్ సర్కారు తీరుపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలన్ మస్క్ సంస్థల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదారు లక్షల మంది పనిచేస్తున్నారనీ, వారిని సగానికి కుదించడంలో భాగంగా వలసదారులను తిరిగి పంపాలని ట్రంప్‌పై ఒత్తిడి తీసుకొచ్చారని తెలిపారు. అందులో భాగంగానే భారతీయులను అక్కడ నుంచి క్రిమినల్స్ మాదిరిగా తరలిస్తున్నారని వాపోయారు. భారతీయ యువత 30, 40 ఏండ్లుగా అమెరికా దేశ అభివృద్ధికి దోహదపడుతున్న తీరును వివరించారు. బతకడానికి అమెరికా వెళ్లిన భారతీయులను అవమానకరంగా తిరిగి పంపుతుంటే కొందరు బిజెపి తొత్తులు ట్రంప్ చర్యలను సమర్థించడం దుర్మార్గమన్నారు. వారంతా ఏజెంట్లు, దళారులను నమ్మి మోసపోయినవారేనని చెప్పారు. వారు క్రిమినల్స్ కాదనీ, ఈ దేశంలో తాము చదువుకున్న చదువులకు సరైన వసతులు లేక ఉపాధిని వెతుక్కుంటూ అమెరికా వెళ్లినవారని గుర్తుచేశారు. వారికి సరైన సౌకర్యాలు, వసతలు కల్పిస్తే విదేశాలకు పోవాల్సిన అవసరం ఏమొస్తుందని ప్రశ్నించారు. ఈ నిరసనలో ఎఐపిఎస్ఒ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వర్‌రావు, కాచం సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రేడియో దినోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిఆర్‌సిఐ) హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో ప్రపంచ రేడియో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రేడియో సామాజిక చైతన్యాన్ని ఆకర్షించడంలో, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నదని పలువురు వ్యాఖ్యానించారు. మీడియా, పబ్లిక్ రిలేషన్స్ తదితర రంగాలకు చెందిన ప్రముఖులు రేడియో చారిత్రాత్మక ప్రాముఖ్యతను, డిజిటల్ యుగంలో దాని పాత్రను చర్చించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆర్వి చంద్రవదన్ మాట్లాడుతూ... పిల్లలు, యువత, వృద్ధులకు విశ్వసనీయ మాధ్యమంగా రేడియో నిలిచిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌సిఐ హైదరాబాద్ ఛాప్టర్ చైర్మన్ షకీల్ అహ్మద్, వైస్‌చైర్మెన్ ఆనీజా, కార్యదర్శి ఫిలిప్ పాల్గొన్నారు. రోబిన్, జేకబ్ రాస్, ఇతర సభ్యులు కూడా ఈ కార్యక్రమానికి హాజరై, రేడియో భవిష్యత్తు గురించి చర్చించారు. హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విశిష్ట కార్యక్రమం, రేడియో వారసత్వాన్ని గౌరవించి, దాని ప్రభావాన్ని రాబోయే తరాలకు అందించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది.

పింక్‌బుక్‌లో రాసుకుంటున్నాం

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

"రైతు భరోసా డబ్బులు ఎకరా.. ఎకరాకు వేస్తున్నారు.. రైతులు ఏమైనా బిచ్చగాళ్లా? కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతుంటే తమ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారు.. వారి జోలికొస్తే ఊరుకోబోం.. అన్నీ పింక్‌బుక్‌లో రాసుకుంటున్నాం.. అధికారంలోకొచ్చాక అన్నీ తిరిగి చెల్లిస్తాం.. లెక్కలు ఎలా రాయాలో మాకు తెలుసు.. మీ లెక్కలు తీస్తాం.." అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఎఐదే భవిష్యత్తు

- 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఎఐ విద్య
- మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు-ఎఐ)దేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైక్రోసాఫ్ట్‌తో కలిసి విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించేందుకు రాష్ట్రంలో 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఎఐ విద్యను ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ, ప్రజా సేవల కోసం ఎఐను ఉపయోగించుకోనున్నట్టు వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో మరో కొత్త మైక్రోసాఫ్ట్ ఎఐ ఫెసిలిటీ సెంటర్ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలురాయి అని అభివర్ణించారు. తమ ప్రభుత్వ సహకారంతో మైక్రోసాఫ్ట్ ఎఐ సెంటర్ ఏర్పాటు చేస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఎఐ సెంటర్ ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్‌తో తమ ప్రభుత్వం ఎంఒయూ కుదుర్చుకున్నట్టు సిఎం ప్రకటించారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ఇటీవలే 25 ఏళ్లు పూర్తి చేసుకుందని గుర్తుచేశారు. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ నుంచి గ్లోబల్ ఇన్నోవేషన్, ఇంపాక్ట్ క్రియేట్ చేసిందని తెలిపారు. ఇది యువతకు మరింత సాధికారత కల్పిస్తుందని చెప్పడానికి తాను సంతోషిస్తున్నానని చెప్పారు. భవిష్యత్తు ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేనని ఉద్ఘాటించారు. మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని మెరుగైన ఉద్యోగాలు లభించనున్నాయని తెలిపారు. మైక్రోసాఫ్ట్ పెట్టుబడి తమ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడంతోపాటు మెంటార్‌షిప్, ఎఐ టూల్స్, గ్లోబల్ నెట్‌వర్క్ యాక్సెస్‌ను చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటైన ఫెసిలిటీ సెంటర్ ఎఐ నాలెడ్జ్ హబ్ సహా క్లౌడ్ ఆధారిత ఎఐ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుందని వివరించారు. తెలంగాణపై నమ్మకం ఉంచిన మైక్రోసాఫ్ట్ లీడర్ షిప్ టీమ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆవిష్కరణల పట్ల వారికున్న నిబద్ధత తెలంగాణ రైజింగ్ విజన్‌కు తోడవుతుందని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్

మౌలిక వసతుల అభివృద్ధికి రూ.15 వేల కోట్లు :మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం రూ.15 వేల కోట్లతో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. మెట్రో రైలు విస్తరణ, రీజనల్ రింగురోడ్డు, ఫ్యూచర్ సిటీ, ఎఐ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, విద్యుత్తు వాహనాల ఉత్పత్తి కేంద్రంగా, క్వాంటమ్ ఇంజనీరింగ్, బయో ఇన్ఫర్మేటిక్స్ రంగాలతో పాటు మూసీ పునరుజ్జీవన పథకం సదుపాయల కల్పనలో భాగమన్నారు. మైక్రోసాఫ్ట్ సంస్థతో హైదరాబాద్ అనుబంధం మూడు దశాబ్దాల నాటిదనీ, తాజాగా 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన భవనం నిర్మించడం ద్వారా తన అంకితభావాన్ని చాటుకుందని ఆయన ప్రశంసించారు. రూ.15 వేల కోట్ల పెట్టుబడితో భారీ ఎఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తోందని ఆయన తెలిపారు. దేశంలోనే హైదరాబాద్‌ను అతిపెద్ద డేటా సెంటర్ల హబ్‌గా మారుస్తోందని కొనియాడారు. 'ఎఐ సిటీలో తమ కృత్రిమ మేధ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఆ సంస్థ ప్రకటించడం తమ ప్రభుత్వ విశ్వసనీయతకు నిదర్శనం. సాంకేతిక దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్ల, అడోబ్ సిఇఒ శంతను నారాయణ్‌లను ప్రపంచ టెక్నాలజీకి అందించిన ఘనత ఈ నగరానిది. ఇది ఒక ఆరంభం మాత్రమే కాదు. సుదీర్ఘ ప్రస్థానానికి రహదారులు వేస్తున్నాం. 52 ప్రపంచస్థాయి పరిశోధన కేంద్రాలు, 30కి మించిన విశ్వవిద్యాలయాలు, ఆరు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సులు, 60 లక్షల మంది ఉత్సాహం ఉరకలెత్తే శ్రామికశక్తితో హైదరాబాద్, తెలంగాణా వెలుగులీనుతోంది. 90 లక్షల ఇళ్లను డిజిటల్ కనెక్టివిటిలోకి తీసుకొస్తున్నాం...' అని శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చిలుకూరు అర్చకుని కేసులో మరో ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'చిలుకూరు' అర్చకులు రంగరాజన్‌పై దాడి చేసిన నిందితుల్లో మరో ఏడుగురిని అరెస్టు చేసినట్టు సిఐ పవన్ కుమార్ రెడ్డి గురువారం తెలిపారు. నిందితుల్లో ఐదుగురు దేవిరెడ్డి వీరబాబు, రేఘన మూర్తి, జలపాల గోవిందరావు, లకోజి వెంకటరమణ, ముప్పిడి వెంకటరమణ శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారని, ముప్పాల వెంకటేశ్వరరావు, కోపేల లక్ష్మణరావు ఇద్దరు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారని తెలిపారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో జరగనున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. మెదక్-నిజామాబాద్- కరీంనగర్- ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయుల స్థానాలకు సంబంధించి 12 మంది పట్టభద్రుల అభ్యర్థులు, ఒక్కరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.

దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీకి మొత్తం 56మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 15మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 19 మంది

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు నిలిచారు. ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్టు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ త్రిపాఠి తెలిపారు.

ఆర్ఆర్ఆర్ పనులు వేగవంతం

- వైమానిక రంగానికి ప్రోత్సాహం
- ఆక్రమణకు గురవుతున్న ఆర్అండ్‌బి
- నిధుల కొరత లేదు
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రాంతీయ వలయ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖ ముందస్తు బడ్జెట్ సమీక్ష చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు డీపీఆర్ త్రిడీ డిజైన్లు వంటి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

నిధుల కొరత లేదన్నారు. ఎంత వేగంగా పనులు చేపడితే అంత వేగంగా నిధులు మంజూరు చేస్తామని డిప్యూటీ సీఎం అధికారులకు భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బీ శాఖకు ఉన్న ఆస్తులపై నివేదిక రూపొందించాలనీ, పెద్ద సంఖ్యలో ఉన్న విలువైన ఈ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా అధికారులు అన్ని స్థాయిల్లో చర్యలు చేపట్టాలని ఇరువురు మంత్రులు ఆదేశించారు. హైబ్రిడ్ యాన్యూటీ హెడ్ (హమ్) రహదారుల నిర్మాణం వేగవంతం చేయాలని చెప్పారు. జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి వచ్చే రహదారులు పూర్తిస్థాయిలో అభివద్ధి చేయాలని కోరారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం మేరకు రోడ్లు భవనాల శాఖ అధికారులు పనులు చేపట్టి నిధులు సద్వినియోగం చేయాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తీసుకువచ్చామన్నారు. గత పది పదేండ్లపాటు పాలించిన వారు ఈ సబ్‌ప్లాన్ చట్టాన్ని నిర్లక్ష్యం చేశారని గుర్తుచేశారు. తిరిగి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ పూర్తిస్థాయిలో అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ చట్టం నిధుల మేరకు స్థానికంగా పనులు చేపడుతున్న విషయాన్ని ఆ ప్రాంత నేతలు, ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఆర్అండ్‌బీ శాఖ అధికారులపై ఉందన్నారు. కొత్త ఎయిర్ పోర్టుల నిర్మాణానికి ఆర్అండ్‌బి శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో ఏవియేషన్ రంగానికి తగిన ప్రోత్సాహం అందిస్తామని మంత్రులు తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకష్ణారావు, వికాస్‌రాజ్, డిప్యూటీ సిఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, కార్యదర్శి దాసరి హరిచందన, ఆర్థిక శాఖ కార్యదర్శి హరిత తదితరులు పాల్గొన్నారు.

భారీ దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

- 24 గంటల్లో బీహార్ గ్యాంగ్ అరెస్ట్
- విలువైన బంగారు ఆభరణాలు, డైమండ్స్, సిల్వర్, నగదు స్వాధీనం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో సంచలనం రేపిన దోపిడీ కేసును నారాయణగూడ, ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 1.40 కిలోల బంగారు ఆభరణాలు, 710 క్యారెట్ల డైమండ్స్, 215 గ్రాముల సిల్వర్‌తోపాటు విదేశీ కరెన్సీ, రూ.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. గురువారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సీసీసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ వెల్లడించారు. బీహార్‌కు చెందిన మోల్హు ముఖియా, సుశీల్ ముఖియా పాత నేరస్థులు. సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో పథకం ప్రకారం మార్వాడీలు, జైన్‌లతోపాటు సంపన్నులను టార్గెట్ చేస్తారు. వారివద్ద సర్వెంట్స్‌గా, సెక్యూరిటీ గార్డులుగా, వంటమనిషిగా లేదా చిన్నచిన్న పనివాళ్లుగా చేరుతున్నారు. యజమానుల నమ్మకాన్ని సంపాదించి ఆ తర్వాత అదును చూసుకుని దోపిడీలకు పాల్పడుతున్నారు. అవసరమైతే హత్యలకు వెనుకాడరు. దోపిడీ సొమ్ముతో సొంత గ్రామాలకు పారిపోతారు. ఇదే తరహాలో హిమాయత్‌నగర్ మినర్వా హోటల్ గల్లీలో నివాసముంటున్న రోహిత్ కేడియా అనే వ్యాపారిని టార్గెట్ చేశారు. అతని ఇంట్లో మోల్హు ముఖియా, అభయక్ కేడియా సర్వెంట్స్‌గా చేరారు. కొన్నాళ్లపాటు నమ్మకంగా పనిచేసిన నిందితులు కొద్దినెలల కిందట పని మానేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత తిరిగి హైదరాబాద్‌కు వచ్చిన నిందితులు బసంతి అర్హి అనే స్నేహితునితో కలిసి రోహిత్‌ను కలిశారు. అప్పటికే రోహిత్ తన దగ్గరి బంధువు పెండ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. ఇంట్లో మరికొంత మంది పనివారున్నారు. ఈ క్రమంలో బీహార్ నుంచి వచ్చిన వారిని (నిందితులను) పెండ్లి పనులు చూసుకోండని చెప్పాడు. పెండ్లికి హాజరయ్యేందుకు రోహిత్ కేడియా కుటుంబ సభ్యులతో కలిసి దుబాయ్‌కి వెళ్లారు. అదే అదనుగా భావించిన మోల్హు ముఖియా దోపిడీకి స్కెచ్ వేశాడు. ఈనెల 11న తెల్లారుజామున ఇంట్లోని బంగారు ఆభరణాలు, డైమండ్స్, విదేశీ కరెన్సీతోపాటు విలువైన వస్తువులను, రూ.20లక్షలు ఎత్తుకెళ్లారు. ఇంట్లో దోపిడీ జరిగినట్టు గుర్తించిన రోహిత్ మేనేజర్ అభయ్ కేడియా విషయాన్ని దుబాయ్‌లో ఉన్న రోహిత్‌కు చెప్పాడు. అతని సూచనలతో నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న సిపి నారాయణగూడ సివిల్ పోలీసులతోపాటు టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించారు.

నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టిన పోలీసులు

దోపిడీ జరిగిన పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలతోపాటు నిందితుల సిడిఆర్(సెల్‌ఫోన్ డేటా)ను పరిశీలించారు. నిందితులు సికింద్రాబాద్ నుంచి రైలులో పారిపోతున్నట్టు గుర్తించి వారిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా మరో మూడు బృందాలను అప్రమత్తం చేశారు. అందులో ఒక టీమ్‌ను భూపాల్, మరో టీమ్‌ను నాగ్‌పూర్, ఇంకో టీమ్‌ను పట్నాకు విమానంలో పంపించారు. రైల్వే జీఆర్‌పీ టీమ్స్‌ను సైతం అప్రమత్తం చేసి నిందితులను నాగ్‌పూర్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఈ బీహార్ ముఠాసభ్యులు 2024లో దోమల్‌గూడలో ఓ వృద్ధురాలిని హత్యచేసి దోపిడీకి పాల్పడిన కేసులో ప్రధాన నిందితులు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్నారు. దోపిడీ చేసిన వస్తువుల విలువ మార్కెట్‌లో దాదాపు రూ. ఐదు కోట్లకుపైగా ఉంటుంది. 24గంటల్లో నిందితులను పట్టుకుని, కేసును ఛేదించినందుకు నారాయణగూడ సివిల్ పోలీసులను, టాస్క్‌ఫోర్సు పోలీసులను సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

మహారాజశ్రీ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. 1057/2022 ఇన్ ఓ.ఎస్. 185/2017
జక్కా సుబ్బారావు ...పిటీషనర్/వాది
వర్సెస్
మార్కాపురపు జాన్ వివేకానందం (చనిపోయినందున వారసులు) జాన్ వివేకానందం మరియు ఇతరులు ... రెస్పాండెంట్లు/ప్రతివాదులు
టు,
ఆర్-8,
మాకం జ్యోతి, భర్త: దానియేలు, పాస్టర్
ప్రగతినగర్, జెఎన్‌టియు బాప్టిస్ట్ చర్చి ఎదురుగా,
హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.
పై నెంబరు దావా నందు కోర్టు వారి ద్వారా నీకు ఐ.ఎ. నోటీసులు ఎన్ని పర్యాయములు పంపిననూ తీసుకొనకుండా కాలాయాపన చేసి ఉన్నారు. కావున ఘనమైన కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా మీకు ఐ.ఎ. నోటీసులు జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున నీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 06-03-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు నందు హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు విమర్శచేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా: 06-03-2025
ఆర్.వి.నాగేశ్వరశాస్త్రి,
అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. 1058/2022 ఇన్ ఓ.ఎస్. 185/2017
జక్కా సుబ్బారావు ... పిటీషనర్/వాది
వర్సెస్
మార్కాపురపు జాన్ వివేకానందం (చనిపోయినందున వారసులు) జాన్ వివేకానందం మరియు ఇతరులు ... రెస్పాండెంట్లు/ప్రతివాదులు
టు,
ఆర్-8,
మాకం జ్యోతి, భర్త: దానియేలు, పాస్టర్
ప్రగతినగర్, జెఎన్‌టియు బాప్టిస్ట్ చర్చి ఎదురుగా,
హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.
పై నెంబరు దావా నందు కోర్టు వారి ద్వారా నీకు ఐ.ఎ. నోటీసులు ఎన్ని పర్యాయములు పంపిననూ తీసుకొనకుండా కాలాయాపన చేసి ఉన్నారు. కావున ఘనమైన కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా మీకు ఐ.ఎ. నోటీసులు జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున నీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 06-03-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు నందు హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు విమర్శచేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా: 06-03-2025
ఆర్.వి.నాగేశ్వరశాస్త్రి,
అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. 1059/2022 ఇన్ ఓ.ఎస్. 185/2017
జక్కా సుబ్బారావు ... పిటీషనర్/వాది
వర్సెస్
మార్కాపురపు జాన్ వివేకానందం (చనిపోయినందున వారసులు) జాన్ వివేకానందం మరియు ఇతరులు ... రెస్పాండెంట్లు/ప్రతివాదులు
టు,
ఆర్-8,
మాకం జ్యోతి, భర్త: దానియేలు,
పాస్టర్ ప్రగతినగర్, జెఎన్‌టియు బాప్టిస్ట్ చర్చి ఎదురుగా, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.
పై నెంబరు దావా నందు కోర్టు వారి ద్వారా నీకు ఐ.ఎ. నోటీసులు ఎన్ని పర్యాయములు పంపిననూ తీసుకొనకుండా కాలాయాపన చేసి ఉన్నారు. కావున ఘనమైన కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా మీకు ఐ.ఎ. నోటీసులు జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున నీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 06-03-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు నందు హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు విమర్శచేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా: 06-03-2025
ఆర్.వి.నాగేశ్వరశాస్త్రి,
అడ్వకేట్, మార్కాపురం.

PRAJAY
Prajay Engineers Syndicate Ltd.
CIN:L45200TG1994PLC017384
Regd. Office: 1-10-63 & 64, 5th Floor, Prajay Coroporate House, Chikoti Gardens, Begumpet, Hyderabad, Telangana 500016, India, Phone : 04066285566, Email : pesl.cs@prajayengineers.com, investorrelations@prajayengineers.com
website: www.prajayengineers.com

STATEMENT OF STANDALONE AND CONSOLIDATED UNAUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER ENDED 31-12-2024

(Rs. in Lakhs)

S. No.	Particulars	Standalone			Consolidated		
		For the Quarter ended 31.12.2024 Un-Audited	Preceeding 3 months ended 30.09.2024 Un-Audited	Corresponding 3 months ended 31.12.2023 Un-Audited	For the Quarter ended 31.12.2024 Un-Audited	Preceeding 3 months ended 30.09.2024 Un-Audited	Corresponding 3 months ended 31.12.2023 Un-Audited
1.	Total Income from Operations	996.06	1690.17	941.03	1266.57	2652.32	2132.60
2.	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and / or Extraordinary items)	(91.28)	(339.71)	(358.87)	(376.31)	(582.27)	(678.33)
3.	Net Proft / (Loss) for the period before tax (after Exceptional and / or Extraordinary items)	(91.28)	(339.71)	(358.87)	(376.31)	(582.27)	(678.33)
4.	Net Profit / (Loss) for the period after Tax (after Exceptional and / or Extraordinary items)	(118.98)	(378.18)	(364.82)	(404.32)	(620.97)	(684.50)
5.	Total Comprehensive income for the period [Comprising profit / (loss) for the period (after tax) and other Comprehensive income after tax)]	(119.46)	(378.71)	(365.11)	(404.89)	(621.50)	(684.79)
6.	Paid up equity Share Capital (face value of Rs. 10/- each, fully paid)	6993.58	6993.58	6993.58	6993.58	6993.58	6993.58
7.	Earnings Per Share (of Rs. 10/- each) In Rs. (Not Annualised)						
	1. Basic (Rs.)	(0.18)	(0.55)	(0.53)	(0.58)	(0.89)	(0.98)
	2. Diluted (Rs.)	(0.18)	(0.55)	(0.53)	(0.58)	(0.89)	(0.98)

Notes: : The above is an extract of the detailed format of Financial Results filed with the Stock Exchanges under Regulation 33 of SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015. The full format of the said Results is available on the Stock Exchanges websites at www.bseindia.com, www.nseindia.com, and also on the Company's website www.prajayengineers.com. The above financials have been reviewed and recommended by the Audit Committee and have been approved and taken on record by the Board of Directors at its meeting held on 13-02-2025 The Limited Review as required under Regulation 33 of the SEBI (Listing Obligation and Disclosure Requirements) Regulations, 2015 has been completed by the Statutory Auditors of the Company.

For **Prajay Engineers Syndicate Limited**

Place: Hyderabad
Date: 13.02.2025

Sd/-
D. Vijaysen Reddy
(Chairman and Managing Director)
DIN:00291185

ఫార్మా బాధితులకు న్యాయం చేయాలి

- సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి
- నిషేధిత జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలి
- వారికి రైతు భరోసా, రైతు బీమాను వర్తింపజేయాలి
- రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును అమలు చేయాలి
- ఫార్మా రైతులకు అండగా ఎర్రజెండా పోరాటం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

రైతులతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాసిటీ బాధిత రైతులకు వెంటనే న్యాయం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మాల్ సెంటర్‌లో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఫార్మాసిటీ రైతులతో ముచ్చరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఫార్మాసిటీ రైతులకు ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. యాచారం, కందుకూరు మండలాల్లోని పలు గ్రామాల్లో బలవంతపు భూసేకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. యాచారం మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్త, నానక్‌నగర్, తాడిపర్తి, కురిమిద్ద గ్రామాల్లో దాదాపు 2800 ఎకరాల పట్టా భూమిని గత రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో సేకరించిందని, ఆయా భూములను నిషేధిత జాబితాలో పెట్టిందని గుర్తు చేశారు. వెంటనే నిషేధిత జాబితాలో నుంచి ఆ భూములను తొలగించి రైతులందరికీ రైతు భరోసా, రైతు బీమా, పంట లోన్లు, అదేవిధంగా భూమి అమ్మకాలు, కొనుగోళ్లు చేసుకునే విధంగా వీలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం భూసేకరణ చేసేటప్పుడు 2013 చట్టాన్ని అమలు చేయాలని అన్నారు. ఫార్మా బాధిత రైతులందరికీ కోర్టు ఆర్డర్ ప్రకారం వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించి, వారికి అన్ని అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అధికారులు రైతులకు ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిటీ బాధిత రైతులకు అన్యాయం చేయాలని చూస్తే ఎర్రజెండా పక్షాన పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల కార్యదర్శులు రావుల జంగయ్య, బుగ్గ రాములు, కందుకూరు మండల నాయకులు శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కందుకూరి జగన్, నాయకులు పి.బ్రహ్మయ్య, ఎ. జంగయ్య, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లు, గురుకులాల అద్దె భవనాల బకాయిలు వెంటనే చెల్లిస్తాం

- డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల అద్దె బకాయిలను వెంటనే చెల్లిస్తామనీ, ప్రతిపాదనలు తీసుకురావాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ప్రీ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. సంక్షేమ వసతి గహాలు, గురుకులాల్లో మరమ్మతులు చేపట్టాలి, కిటికీలు, ప్రధాన ద్వారాలతోపాటు దోమతెరలు ఏర్పాటు చేయాలని అందుకు అవసరమైన నిధులు వెంటనే కేటాయిస్తామని మంత్రులు తెలిపారు.

బిసి స్టడీ సెంటర్లు ఉద్యోగ కల్పన కేంద్రాలుగా ఉండాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జాబ్ క్యాలెండర్‌ను అనుసరించి స్టడీ సెంటర్లలో కోచింగ్ నిర్వహించాలని కోరారు. డిఎస్‌సి, బ్యాంకింగ్ వంటి పరీక్షల పైన దష్టి సారించాలని ఆదేశించారు. గురుకులాల్లో ఒకేషనల్ కోర్సులు ప్రవేశం పెట్టడం మూలంగా ఉపాధి లభించే అవకాశం ఉందని మంత్రులు అభిప్రాయపడ్డారు. రెగ్యులర్ కోర్స్‌తో పాటు ఒక కోర్స్ ఒకేషనల్ కోర్సులకు కేటాయించాలన్నారు. రెసిడెన్షియల్ పద్ధతిలో విద్యార్థులు పూర్తిగా అందుబాటులో ఉంటున్న నేపథ్యంలో ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెడితే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

ఆర్‌టిసిలో ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు వాటి నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. ఆర్‌టిసి ఆస్తులు. నిర్వహణ, ఆదాయ వనరులపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, ఆర్‌టిసి ఎండి సజ్జనార్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌సిపి నీరు విడుదల చేయాలి

- పురుగుల మందు డబ్బాతో ఎండిన పొలంలో రైతు నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీళ్ల లేక పొలాలు ఎండిపోతున్నాయని వెంటనే ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని రైతు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ వేములకొండ లక్ష్మయ్య డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని కుడకుడలోని తన ఎండిన పొలంలో గురువారం పురుగుల మందు డబ్బా పట్టుకుని ఆయన నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో ఎస్‌ఆర్‌సిపి కాలువ ద్వారా నీరు సమయానికి ఇచ్చారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో నీరు రాక నాలుగెకరాల పొలం ఎండిపోవడం చూసి తట్టుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వివిధ రంగాల్లో 'ఎఐ' వినియోగం

- గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాన్ని ఉపయోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ ఐటి సంస్థ గూగుల్‌తో ఒప్పందం చేసుకుంది. ప్రధానంగా వ్యవసాయం, సుస్థిరాభివృద్ధి, పరిపాలన, రవాణా, విద్య తదితర కీలక రంగాల్లో ఎఐ ఆధారిత సేవలు, పరిష్కారాలు అమలు చేయాలని లక్ష్యంగా ఎంచుకుంది. దీంతో భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా డిజిటల్ నైపుణ్యాలతో శ్రామిక శక్తిని సన్నద్ధం చేసేందుకు వ్యూహాత్మక సహకారం అందించనుంది. హైదరాబాద్‌లోని టీ హబ్‌లో గురువారం ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు గూగుల్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం రైతులకు వ్యవసాయ సంబంధిత ఏఐ ఆధారిత పరిష్కారాలు అందించనుంది. రవాణా సదుపాయాలను మెరుగుపరిచే డేటా ఇంటిగ్రేషన్ సదుపాయాల కల్పనలోనూ భాగస్వామ్యం పంచుకుంటుంది. గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ ద్వారా ఎఐ నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమాలపై దృష్టి సారిస్తుంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో డిజిటల్ అభ్యసన పద్ధతులను ప్రారంభిస్తుంది. గూగుల్ వర్క్ స్పేస్, క్రోమ్ సర్వీసెస్‌ను అందిస్తుంది. రైతులకు అవసరమైన ఇన్‌పుట్, రెడిట్, మార్కెటింగ్ సదుపాయాలన్నీ అనుసంధానం చేస్తూ తెలంగాణ ఓపెన్ అగ్రికల్చర్ నెట్‌వర్క్‌ను ప్రారంభిస్తుంది. గూగుల్ డేటా కామన్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఓపెన్ డేటా యాక్సెస్‌ను మెరుగుపరుస్తుంది.

గూగుల్ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకుంటున్న సిఎం రేవంత్

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ " ఏఐ ఆధారిత తెలంగాణ దార్శనికతకు గూగుల్ సహకారం ఎంతగానో ఉపయోగపడుతుంది. అత్యాధునిక ఏఐ టెక్నాలజీ ద్వారా కీలక రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని లక్ష్యంగా ఎంచుకున్నాం. మెరుగైన పాలన, ఆర్థిక పురోగతితో పాటు ప్రజా సేవలను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని అనుకున్నాం. ఈ లక్ష్య సాధనలో గూగుల్‌తో ఒప్పందం కీలకంగా నిలుస్తుంది..' అని ఆశాభావం వ్యక్తం చేశారు. గూడుల్ ఇండియా కంట్రీ మేనేజర్ ప్రీతి లోబానా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ కీలక రంగాలలో సహకారం అందించటం సంతోషంగా ఉందన్నారు. దేశ డిజిటల్ భవిష్యత్తు పట్ల తమ సంస్థ నిబద్ధతను ఈ నిర్ణయం బలోపేతం చేస్తుందని తెలిపారు. ఎఐ ఆధారిత వర్క్ ఫోర్స్‌ను పెంపొందించటం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం, వ్యవసాయం, విద్య లాంటి కీలక రంగాల్లో పని చేయటం ఉత్సాహంగా ఉందని ప్రీతి హర్షం వ్యక్తం చేశారు.

19న ముట్టడి కార్యక్రమం రద్దు

- ఎఐటియుసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టివివిపి ఆస్పత్రుల కాంట్రాక్ట్ కార్మికుల బడ్జెట్ రిలీజ్ అయినందున 19న ముట్టడి కార్యక్రమం రద్దు చేసుకున్నట్టు ఏఐటీయూసీ తెలిపింది. ఈ మేరకు గురువారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి యూసుఫ్, ఎం. నరసింహ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల ఏడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నందున కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తామని ఫిబ్రవరి 10న నోటీసు అందజేసినట్టు తెలిపారు. గురువారం కార్మికుల జీతాల కోసం ఆరు నెలల బడ్జెట్‌ను విడుదల చేయడంతో ముట్టడి కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నట్టు వివరించారు.

ఎసిబికి పట్టుబడ్డ ఆర్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భర్త పేరిట ఉన్న భూమిని భార్య పేరిట మార్చడానికి లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ దుబ్బాక ఆర్ఐ ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ఘటన సిద్దిపేట పట్టణంలో బుధవారం రాత్రి జరిగింది. ఉమ్మడి మెదక్ జిల్లా ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దుబ్బాక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)గా పనిచేస్తున్న ఎం నర్సింహారెడ్డి అప్పనపల్లి గ్రామానికి చెందిన కుంభం రాజిరెడ్డి పేరిట ఉన్న 3.25 ఎకరాల భూమిని ఆయన భార్య సుజాత పేరు మీద మార్చడానికి గత నెల దరఖాస్తు చేసుకున్నారు. ఇలా మార్చేందుకు ఆర్ఐ నరసింహారెడ్డి లక్ష రూపాయలు డిమాండ్ చేశారు. బాధితురాలు ఎసిబిని ఆశ్రయించగా.. బుధవారం సిద్దిపేటలోని ఓ శానిటరీ దుకాణంలో లక్ష నగదును లంచంగా తీసుకుంటూ ఆర్ఐ నర్సింహారెడ్డి ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆర్ఐని అరెస్టు చేసిన అనంతరం సిద్దిపేటలోని ఆయన నివాసం, దుబ్బాకలోని తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. కొంత నగదు, బంగారం, పలు రికార్డులను స్వాధీనం చేసుకుని, బ్యాంకు లాకర్లకు సీల్ వేసినట్టు డీఎస్పీ తెలిపారు.

రెయిలింగ్ కూలిన ఘటనలో నివేదిక ఆలస్యం

- ఆర్‌అండ్‌బి ఇంజనీర్లపై వికాస్‌రాజ్ ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర సచివాలయంలో రెయిలింగ్ కూలిన ఘటన నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లు నివేదిక ఇవ్వడంలో చేసిన ఆలస్యంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు రూ. 1200 కోట్లతో కొత్త సచివాలయాన్ని గత ప్రభుత్వం నిర్మించిన సంగతి తెలిసిందే. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఛాంబర్ ఉండే అయిదో అంతస్తులోని రెయిలింగ్ పట్టి కొంత భాగం బుధవారం కూలింది. ఈ ఘటనపై రోడ్లు, భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ విచారణకు ఆదేశించారు. 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు. కాగా, దీన్ని సచివాలయం ఆర్‌అండ్‌బీ శాఖ ఇంజనీర్లు పట్టించుకోలేదు. వికాస్‌రాజ్‌కు నివేదిక పంపలేదు. దీంతో వికాస్‌రాజ్ గురువారం సచివాలయ భవన ఇంజినీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటలు దాటినా ఎందుకు నివేదిక ఇవ్వలేదంటూ ప్రశ్నించినట్టు తెలిసింది. మరో 24 గంటల్లో సచివాలయం భవన నిర్మాణంలో లోపాలు, ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయి, పార్కింగ్ తదితర మొత్తం సమస్యలపై పూర్తిస్థాయి నివేదిక పంపాలని భవనానికి చెందిన ఇంజినీర్లను ఆదేశించారు. మొత్తం భవనాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి పెచ్చులు ఊడటం, పగుళ్లు రావడం, చీలికలు తదితర అంశాల గురించి నివేదికలో పొందుపరచాలని వికాస్‌రాజ్ సూచించినట్టు సమాచారం.

తప్పుడు ప్రకటనలతో మందుల అమ్మకాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తప్పుడు ప్రకటనలతో అమ్ముతున్న మందులను డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి, హన్మకొండ జిల్లాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు దాడులు నిర్వహించారు. ఈ దాడుల సందర్భంగా ఆయుర్వేద మందులు స్టోన్‌నిల్ డీఎస్‌సిరప్ మూత్రపిండాల్లో రాళ్ల చికిత్సకంటూ, అదే విధంగా మహాసుదర్శన్ కద జ్వరానికి చికిత్సకంటూ తప్పుడు ప్రకటనలను వాటి లేబుళ్లపై ముద్రించినట్టు గుర్తించారు. హర్యానాలో తయారు చేస్తున్న స్టోన్ నిల్ డిఎస్ సిరప్‌ను దుండిగల్-గండిమైసమ్మ వద్ద, అదే విధంగా ముంబయిలో తయారవుతున్న మహాసుదర్శన్ కదను హన్మకొండలో స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (ఆబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్ మెంట్స్) యాక్ట్, 1954 ప్రకారం ఫలానా చికిత్సకంటూ మందులపై పేర్కొనడాన్ని నిషేధించినట్టు అధికారులు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం స్క్రీనింగ్ కార్యక్రమాలు

- క్షయ వ్యాధి విస్తరించకుండా చికిత్స
- సకాలంలో న్యూట్రిషన్ కిట్స్ అందజేస్తున్న ఫార్మా కంపెనీలు : మంత్రి దామోదర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్షయ వ్యాధి విస్తరించకుండా రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఎనిమిది ఫార్మా కంపెనీలు తమ సిఎస్ఆర్ నిధులతో వ్యాధిగ్రస్తులకు చికిత్సా కాలంలో న్యూట్రిషన్ కిట్స్‌ను ఉచితంగా అందిస్తున్నాయని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులకు మంత్రి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఉచితంగా మందులు, ప్రతి నెలా చికిత్స కోసం రూ. వెయ్యి నగదు అందజేస్తున్నట్టు తెలిపారు. ఆ వ్యాధి నిర్మూలనకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను, యాక్టివ్ కేస్ ఫైండింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వంద రోజుల పాటు క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది జిల్లాలలో ఉధృతంగా కొనసాగిస్తున్నట్టు వెల్లడించారు.

న్యూట్రిషన్ ఫుడ్‌ను అందిస్తున్న కార్పొరేట్ ఫార్మా కంపెనీలైనా ఆరాజన్ ఫౌండేషన్, ఆప్టిమస్ డ్రగ్స్, బయోలాజికల్-ఈ, గ్లాండ్ ఫార్మా, మెట్రో కెమ్, నాట్కో ఫార్మా, గ్రాన్యూల్స్, సన్ ఫార్మాసిటికల్ కంపెనీలను మంత్రి అభినందించారు. ఆ కంపెనీలు రూ.2.80 కోట్ల విలువైన ఫుడ్ బాస్కెట్ (కిట్స్)ను అందిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, కరీంనగర్, పెద్దపల్లి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో (తొమ్మిది జిల్లాలు) వంద రోజులపాటు క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు.

ఎస్‌ఆర్‌సిపి నీరు విడుదల చేయాలి

- పురుగుల మందు డబ్బాతో ఎండిన పొలంలో రైతు నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీళ్ల లేక పొలాలు ఎండిపోతున్నాయని వెంటనే ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని రైతు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ వేములకొండ లక్ష్మయ్య డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని కుడకుడలోని తన ఎండిన పొలంలో గురువారం పురుగుల మందు డబ్బా పట్టుకుని ఆయన నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో ఎస్‌ఆర్‌సిపి కాలువ ద్వారా నీరు సమయానికి ఇచ్చారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో నీరు రాక నాలుగెకరాల పొలం ఎండిపోవడం చూసి తట్టుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

600 కిలోల కుళ్లిన చికెన్ స్వాధీనం

- కంటోన్మెంట్‌లో చికెన్ షాప్‌లపై ఆహార భద్రత అధికారుల దాడులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని రెండోవార్డు అన్నానగర్‌లో చికెన్ దుకాణాల్లో ఆహార భద్రత, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా గురువారం దాడులు చేశారు. దాదాపు 600 కిలోల కుళ్లిన చికెన్‌ను నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. పూర్తిగా కుళ్లి పాడైపోయిన స్థితిలో ఉన్న చికెన్‌ను విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది. అన్నానగర్‌లో ఎస్ఎస్ఎస్, రవి చికెన్ దుకాణాల్లో 600 కిలోల చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. రెండు మూడు నెలలపాటు నిల్వ ఉంచిన చికెన్‌ను తక్కువ ధరకు మద్యం దుకాణాలు, బార్లకు విక్రయిస్తున్నట్టు అధికారులు తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు దాడులు నిర్వహించిన కంటోన్మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పాడైపోయిన చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

దవాఖానాల్లో ఒపి ఎందుకు పడిపోయింది?

- మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పల్లె, బస్తీ దవాఖానాల్లో ఒపి ఎందుకు పడిపోయింది? అని వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. ప్రాథమిక వైద్య సేవలందించడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని ఆయన విమర్శించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా, దమ్మాయిగూడ మున్సిపాల్టీ కీసర హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌కు తాళం వేసే దుస్థితి వస్తే ప్రభుత్వం, వైద్యారోగ్య శాఖ ఏం చేస్తున్నట్టు? హైదరాబాద్ సహా నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో బస్తీ దవాఖానాల పనితీరు దుర్భరంగా ఉన్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు? అని ప్రశ్నించారు. గతంలో ప్రజల సుస్తీని పల్లె, బస్తీ దవాఖానాలు పోగొడితే వాటికే సుస్తీ పట్టించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం జిహెచ్ఎంసి పరిధిలో 500 బస్తీ దవాఖానాలు, అదే విధంగా గ్రామాల్లో పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసిందనీ, బస్తీ దవాఖానాలకు 15వ ఆర్థిక సంఘం ప్రశంసలు వచ్చాయని గుర్తుచేశారు. 134 రకాల ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా వైద్యారోగ్య శాఖ ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించకపోవడం, వైద్యాధికారుల అలసత్వం, వైద్యులు సమయానికి రాకపోవడం, సాయంత్రం నాలుగు గంటల వరకు సేవలందించాల్సిన బస్తీ దవాఖానాలు మధ్యాహ్నం వరకే మూతపడటం, కొన్ని చోట్ల వైద్యులు వారానికి ఒకసారి మాత్రమే రావడం, ఆదివారం బస్తీ దవాఖానాలకు వైద్య సిబ్బంది రాక తాళం వేసి ఉండటం, బస్తీ దవాఖానాల ద్వారా వచ్చే రోగుల టెస్టులు నిర్వహించడంలో అలసత్వం, కొన్ని చోట్ల ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడం, మరికొన్ని చోట్ల సర్వర్ సమస్యలు, బిపి, డయాబెటిస్, థైరాయిడ్ మెడిసిన్స్ సరఫరా చేయకపోవడం తదితర సమస్యలతో ఓపీ తగ్గిందని తెలిపారు. దీంతో పేదలు అనివార్యంగా ప్రయివేటు డయాగ్నస్టిక్ సెంటర్లు, ఆస్పత్రులకు వెళుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించి పేద ప్రజలకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

మానుకోట సాలార్ తండా వద్ద ఉద్రిక్తత

ఎన్‌హెచ్ సర్వేను అడ్డుకున్న గిరిజనులు

పోలీసులు, మహిళలకు మధ్య వాగ్వాదం, తోపులాట

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వలిగొండ నుంచి భద్రాచలం వరకు ప్రభుత్వం నిర్మిస్తున్న 930పి జాతీయ రహదారి సర్వేలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గురువారం ఉదయం మహబూబాబాద్ జిల్లా శివారు కొత్త కలెక్టరేట్ సాలార్‌తండాకు ఆర్‌డిఓ కృష్ణవేణి, తహశీల్దార్ భగవాన్‌రెడ్డి ఆధ్వర్యంలో నేషనల్ హైవే అధికారులు సర్వేకు రాగా.. గిరిజనులు అడ్డుకున్నారు. దాంతో గిరిజన మహిళలు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. డిఎస్‌సి తిరుపతి నేతృత్వంలో 300 మంది పోలీసుల పహారాతో 100 మందిని హౌస్ అరెస్ట్ చేసి సర్వే కొనసాగించారు. బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, హరిప్రియనాయక్ భూములను తప్పించేందుకు లంబాడీ గిరిజనుల భూముల పైనుంచి రోడ్డు వేయడానికి సర్వే చేస్తున్నారని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వలిగొండ నుంచి వయా తిరుమలగిరి, తొర్రూరు, మహబూబాబాద్, ఇల్లందు-కొత్తగూడెం మీదుగా భద్రాచలం వరకు 930పీ నేషనల్ హైవే 2017లో మంజూరైంది. ఈ రోడ్డు కోసం వలిగొండ నుంచి తురుము వరకు భూసేకరణతో పాటు టెండర్లు పూర్తయి పనులు కొనసాగుతున్నాయి. తొర్రూరు వయా నెల్లికుదురు, మహబూబాబాద్, ఇల్లెందు కొత్తగూడెం నుంచి భద్రాచలం వరకు ల్యాండ్ ఆక్టివేషన్ కోసం సర్వే పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిపురం గ్రామం, మెడికల్ కాలేజీ, కలెక్టరేట్ పక్క నుంచి ఇల్లందు రోడ్డుకు నేషనల్ హైవేను కలుపుతున్నారు. సర్వేలో భాగంగా గురువారం ఉదయం 5 గంటలకు నేషనల్ హైవే, రెవెన్యూ అధికారులు.. కలెక్టరేట్ సమీపంలో ఉన్న సాలార్ తండా వద్దకు వచ్చారు. కాగా, భూ సేకరణను వ్యతిరేకిస్తున్న గిరిజనులు సర్వే సమయంలో ఘర్షణకు దిగుతారన్న అనుమానంతో 300 మంది పోలీసులతో అధికారులు గ్రామానికి వచ్చారు. 100 గృహాల వద్ద పోలీసులను కాపలా పెట్టారు. అయినా సర్వేను అడ్డుకోవడానికి 50 మంది గిరిజన రైతులు రాగా.. వారిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా.. వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో వారిని అదుపులోకి తీసుకొని మానుకోట కొరివి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

డిగ్రీ అధ్యాపకుల వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచండి

- ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు టిఎసిటిఎ వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లతో సమానంగా డిగ్రీ అధ్యాపకులకూ వయోపరిమితిని 65 ఏండ్లకు పెంచాలని తెలంగాణ అఫిలియేటెడ్ కాలేజీ టీచర్ల సంఘం (టిఎసిటిఎ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకృష్ణారెడ్డిని ఆ సంఘం అధ్యక్షులు గంటా జలంధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సూరారపు బిక్షం నేతృత్వంలో కలిసి వినతిపత్రం అందజేశారు. విశ్వవిద్యాలయాల్లోని ప్రొఫెసర్ల వయో పరిమితిని 60 నుంచి 65 పెంచడం హర్షణీయమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గొప్ప నిర్ణయం తీసుకున్నారనీ, ఆయనకు ధన్యావాదాలు ప్రకటించారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకుల వయోపరిమితిని కూడా 65 ఏండ్లకు పెంచాలని కోరారు. వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎసిటిఎ నాయకులు బిక్షపతి, రాజేశ్వర్, సమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

500 మందికి సంగీత స్కాలర్‌షిప్‌లు

- బుక్ మై షో ఫౌండేషన్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

దేశంలోని నిరుపేద వ్యక్తులు, సంగీతం, ప్రదర్శన కళలకు సాధికారత కల్పించనున్నట్లు బుక్ మై షో ఫౌండేషన్ తెలిపింది. ఇందులో భాగంగా ప్రతిభావంతులైన 500 మందికి సంగీత స్కాలర్‌షిప్‌లను ఇవ్వనున్నట్లు పేర్కొంది. బుక్ ఏ ఛేంజ్ పేరుతో ఇటీవల 20 మంది విద్యార్థులు, ఐదుగురు సంగీత శిక్షకులతో కూడిన 25 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు పేర్కొంది. మొత్తంగా 500 సంగీత స్కాలర్‌షిప్‌లను అందించనున్నట్లు తెలిపింది. ప్రతి టికెట్ కొనుగోలుపై రూ.1 నుంచి విరాళాలు సేకరిస్తున్నట్లు పేర్కొంది.

అప్పుకట్టలేదని ఇంటి గేటు ఎత్తుకెళ్తారా?

- ప్రభుత్వాన్ని నిలదీసిన కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అప్పుకట్టలేదని ఇంటి గేటును తీసుకెళ్తారా? అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా నిలదీశారు. బ్యాంక్ లోన్ కట్టలేదని జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతల గ్రామానికి చెందిన పాడి రైతు ప్రేమలత ఇంటి గేటును బ్యాంకు సిబ్బంది ఎత్తుకుపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. "ఒకనాటి కాంగ్రెస్ పాలనలో రైతులు అప్పులు కట్టకపోతే ఇళ్ల దర్వాజలు, కరెంటు మోటర్లు, స్టార్టర్లను అధికారులు ఎత్తుకుపోయేవారు. రాష్ట్రంలో తిరిగి నాటి కాంగ్రెస్ పాలన రోజులు గుర్తుకొస్తున్నాయి. పేదలపై చూపిస్తున్న ప్రతాపాన్ని పెద్దలపై చూపించగలరా? బడాబాబులకు కోట్ల రూపాయల రుణాలను రైట్ ఆఫ్ చేస్తున్న బ్యాంకులు, పేదల విషయంలో మాత్రం వడ్డీ వ్యాపారుల్లాగా మారి వారి రక్తం తాగుతున్నాయి.